సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శనివారం : 27 : జూలై : 2024



మల్బరీ సాగుతో సిరుల పట్టు

వైఎస్సార్ జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తరిస్తోంది. రైతులు పట్టు పరిశ్రమ వైపు మొగ్గుచూపుతున్నారు. అధికారులు కూడా సలహాలిస్తూ అండగా నిలుస్తున్నారు. -8లో



విశాఖ జట్టు విజయకేతనం

కడపలో ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్ జరుగుతోంది. శుక్రవారం జరిగిన మాచ్‌లో విశాఖ జట్టు చిత్తూరుపై విజయం సాధించింది. -8లో

గరిష్టం/కనిష్టం
34.5/26.8

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 26.8 – 34.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 8.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్ వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ మైనారిటీస్‌లో 2వ విడత అడ్మిషన్లకు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు 27వ తేదీ ఉదయం 9.30 గంటలకు కౌన్సెలింగ్ జరగనుంది. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరుకావాలని ప్రభుత్వ మైనారిటీల ఐటీఐ ప్రధానాచార్యులు జ్ఞానకుమార్ తెలిపారు. అభ్యర్థులకు మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయించనున్నట్లు చెప్పారు.

రేపు ‘కేతు’ స్మృతి సంచిక ఆవిష్కరణ

కడప కల్చరల్: ప్రముఖ కథకులు, భాషావేత్త ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి 85వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ‘కేతు తలపులలో’ పేరిట స్మృతి సంచిక ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నామని సంచిక సంపాదకులు పాలగిరి విశ్వప్రసాద్, కార్యక్రమ నిర్వాహకులు కేతు శిరీష తెలిపారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలుగు సాహిత్య ప్రముఖులు అనేక మంది ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి గురించి రాసిన వ్యాసాలతో పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా ఈ సంచికను రూపుదిద్దామని వారు తెలిపారు. ప్రముఖ కథా రచయిత దాదా హయాత్ అధ్యక్షతన జరగనున్న ఈ సభలో అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ స్మృతి సంచికను ఆవిష్కరిస్తారన్నారు. ప్రముఖ రచయితలు మధురాంతకం నరేంద్ర, కాట్రగడ్డ దయానంద్‌లు ప్రధాన ప్రసంగం చేస్తారన్నారు.

ఏఎఫ్‌యూకు కేటాయించిన స్థలం పరిశీలన



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ స్థలాన్ని పరిశీలిస్తున్న వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం శాశ్వత భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలాన్ని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ శుక్రవారం పరిశీలించారు. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె గ్రామపరిధిలోని 17/1, 17/2 సర్వేనెంబర్‌లో గత ప్రభుత్వం 110.36 ఎకరాల భూమి కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ శాశ్వత భవన నిర్మాణాలకు కావాల్సిన నిధులు, శంకుస్థాపన తదితర అంశాలపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ విభాగం కోఆర్డినేటర్ మాన్విత్‌రెడ్డి, అనిల్, భావన తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తనిఖీ

కడప రూరల్: కడప నగర పరిధిలోని తిలక్ నగర్‌లో శుక్రవారం జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారానికి ఒకసారి ఇంటిలోని తొట్లు, కుండలు, బానలు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలన్నారు. ప్రతి రోజు నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. మూత్రవిసర్జన తరువాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని చెప్పారు. మెడికల్ ఆఫీసర్ అనూస, వెంకట రెడ్డి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్, నాగలక్ష్మి రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజార్‌ను వినియోగంలోకి తెస్తాం



రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ అసిస్టెంట్ జిల్లా డైరెక్టర్ ఆజాద్

వేంపల్లి: పట్టణంలోని రైతు బజార్‌ను ఆగష్టు 6 నుంచి వినియోగంలోకి తీసుకొస్తాని మార్కెటింగ్ అసిస్టెంట్ జిల్లా డైరెక్టర్ ఆజాద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని రైతు బజార్ కేంద్రం వద్ద రైతులతో ఆయన మాట్లాడారు. ఐదు మండలాలకు కేంద్ర బిందువైన వేంపల్లెలో రూ.1.20కోట్ల వ్యయంతో రైతు బజార్‌ను అప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిర్మించినట్లు వెల్లడించారు. రైతులు పండించిన పంటలను నేరుగా విక్రయించేందుకు రైతు బజార్‌ను ఏర్పాటు చేశారని, రైతులు వినియోగించుకోవాలన్నారు. మొత్తం 44స్టాల్స్, 8 రూములు ఉన్నాయని, మరిన్ని వివరాలకు రైతు బజార్ ఎస్టేట్ అధికారిణి రుచితను సంప్రదించాలన్నారు. హార్టికల్చర్ అధికారి రెడ్డయ్య, గ్రామ పంచాయతీ ఈఓ సుబ్బారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి పాల్గొన్నారు.

ఇసుక దోచేయ్.. లారీ నింపేయ్

ఉచిత ఇసుక వ్యవహారంలో తెలుగు దేశం పార్టీ నాయకులు ప్రమేయం ఉండరాదు. ఎక్కడ అక్రమ రవాణాకు అస్కారం తలెత్తకూడదు. పార్టీ శ్రేణుల ప్రవేయం సహించేది లేదు. ఇవి ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు. క్షేత్రస్థాయిలో తద్భిన్నమైన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఇసుక విధివిదానాలు రాకముందు ఇసుక డంప్‌ల నుంచి లూటీ చేశారు.పులివెందుల, బద్వేల్, కమలాపురం ప్రాంతాల్లోని డంప్‌ల నుంచి లక్షాలాది టన్నులు ఇసుక మాయమైంది. టీడీపీ శ్రేణులు అవకాశం ఉన్న ప్రాంతాల్లో యధేచ్ఛగా అక్రమ రావాణాకు పాల్పడుతున్నారు.



పాపాఘ్ని నదిలో లారీల్లో ఇసుకను నింపుతున్న పొక్లెయినర్

- ఉచిత ఇసుక ఉత్తిదే
- పది టైర్ల లారీలతో యథేచ్ఛగా అక్రమ రవాణా
- పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ నాయకుడి ‘టెక్కు’
- చిత్రావతి, పాపాఘ్ని నదులు గుల్ల

కడప కార్పొరేషన్: ఎన్డీయే కూటమి ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన ఉచిత ఇసుక హామీ ఉత్తిదే అని తేలిపోయింది. ఉచితం మాటున టీడీపీ నాయకులు యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తూ ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. ఈ దోపిడీ రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్నప్పటికీ పులివెందుల నియోజకవర్గంలో మరింత ఎక్కువగా జరుగుతోంది. టీడీపీ ముఖ్య నాయకుడు తన అనుచరులను అడ్డుపెట్టుకొని ఇష్టానుసారం ఇసుకను దోపిడీ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేంపల్లె మండలంలోని అలిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో పాపాఘ్ని నదిలోంచి రాత్రివేళ ప్రతిరోజు పదిటైర్ల లారీలతో ఇసుకను తరలిస్తున్నారు. సాధారణంగా టిప్పర్లతో ఇసుకను తరలించడం సర్వసాధారణమే. టిప్పర్లకు ఆరు టైర్లు మాత్రమే ఉంటాయి. వీటిల్లో అయితే ఆరు యూనిట్ల వరకు ఇసుకను తరలించేందుకు ఆస్కారం ఉంటుంది. అదే పదిటైర్ల లారీల్లో అయితే 15 నుంచి 18యూనిట్లు తరలించవచ్చు.దీంతో ఈ తరహా మార్గం ఎంచుకున్నట్లు తెలుస్తోంది. నదిలో రీచ్ లేదు, పైగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిషేధం. మరోవైపు ఇసుక స్థానికంగా స్టాక్‌యార్డులో కూడా లేదు. అయినా అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటు పాపాఘ్ని, అటు చిత్రావతి నదుల నుంచి టీడీపీ నేత సన్నిహితులు, సమీప బంధువులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి నంద్యాల, కర్నూలు, తిరుపతి జిల్లాలతోపాటు కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇసుకను అక్రమంగా తరలించవద్దని, ఎమ్మెల్యేలు, నాయకుల ప్రమేయం ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించినా క్షేత్రస్థాయిలో ఆయన ఆదేశాలు భేఖాతర్ చేస్తున్నారు. ఆ మాటలు ప్రచారానికే తప్ప.. టీడీపీ నాయకులు ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేయలేకపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పులివెందుల నియోజకవర్గంలో తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడినా ఎవరూ అడ్డుకోలేరని, అనధికారికంగా సీఎం చంద్రబాబు అనుమతి ఇచ్చారనే మాటలతో సదరు టీడీపీ నాయకుడు ‘టెక్’ప్రదర్శిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మైన్స్ అండ్ జియాలజీ, పోలీస్, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి అనుమతి లేని ఈ అక్రమ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



రాత్రివేళ ఇసుకను లారీల్లో తరలిస్తున్న దృశ్యం

పక్కాగా ఇసుక పంపిణీ అమలు: కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇసుక పంపిణీ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మైన్స్ అండ్ జియాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లు, జేసీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన ఇసుక విధానాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో 11 స్టాక్ పాయింట్ల వద్ద వున్న 3,67,153 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 79,631వేల టన్నులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇంకా స్టాక్ పాయింట్ల వద్ద 2,87,336 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అన్నారు. దీన్ని పంపిణీ చేయడానికి యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు డిసిల్టేషన్ ద్వారా కొండాపురం మండలంలోని పి అనంతపురం, ఏటూర్లలో రెండు పాయింట్లు గుర్తించామని వెల్లడించారు. ఇసుక రవాణాలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ప్రజలకు పారదర్శకంగా అందించాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద రవాణా చార్జీలు ఎక్కువగా ఉన్న వాటిని గుర్తించి రిపోర్ట్ చేయాలన్నారు. డీఆర్వో గంగాధర్ గౌడ్, గ్రౌండ్‌వాటర్ డీడీ కె.సన్నన, గనులు భూగర్భ శాఖ ఆర్ఐ విమల , డీటీసీ మీరా ప్రసాద్, అడ్మిన్ డిపివో సయ్యద్ ఖాదర్ బాషా ప్రభాకర్ రెడ్డి, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

కడప అర్బన్: యువకుడిపై లాఠీని ఝుళిపించి దాడి చేసిన సంఘటనలో ఎస్ఐ జి. మధుసూదన్‌రెడ్డిని వీఆర్‌కు పంపుతూ ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 20వ తేదీన రాత్రి సమయంలో రాజీవ్ పార్క్ సమీపంలో వాహనాల తనిఖీల సమయంలో నవదీప్ అనే యువకుడిపై ఎస్ఐ దాడి చేశారు. పోలీసుశాఖ తరఫున క్రమశిక్షణ కింద ఈ చర్యలను తీసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

వైభవం.. శివకేశవుల పుష్పయాగం



ఒకే వేదికపై శివ, కేశవులకు పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు



కార్యక్రమానికి హాజరైన భక్తులు

తాళ్లపాకలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

రాజంపేట: వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలమైన తాళ్లపాకలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం శ్రీ చెన్నకేశవునికి, శ్రీ సిద్దేశ్వరస్వామికి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంపెంగ, సన్నజాజి, ఎర్రగన్నేరు, నందివర్ధనం, కాగడాలు తదితర పూలను తెప్పించారు. శ్రీ సిద్దేశ్వరస్వామి, అమ్మవార్లకు అర్చకుడు భక్తవత్సలం, శ్రీ చెన్నకేశవ స్వామి అమ్మవార్లకు అర్చకుడు నరేష్ కుమార్ నేతృత్వంలో వేదపండితులు విఘ్నేష్‌కుమార్, కృష్ణమూర్తి, అర్చకులు మనోజ్‌కుమార్, రఘునందన్‌లు పుష్పయాగం నయనానందకరంగా నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టరు బాలాజీ, సర్పంచి గౌరీశంకర్, విజిలెన్స్ ఇన్‌చార్జి గంగులయ్య, హిందూ ధర్మపరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ, గురుస్వామియాదవ్, వినోద్‌కుమార్, టీడీడీ సిబ్బంది పాల్గొన్నారు.మహిళాభక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు ఆసాంతం పుష్పయాగాన్ని తిలకించి పులకరించిపోయారు. ఈనెల 17న ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు ఘనంగా జరిగాయి. కల్యాణోత్సవం కూడా అంగరంగ వైభవంగా నిర్వహించారు.

రోడ్డు భద్రతా చర్యలు కఠినతరం

- నిబంధనలు ఉల్లంఘించే వారిపై 95428 00800 నంబర్‌కు వాట్సాప్ చేయొచ్చు
- కలెక్టర్, ఎస్పీ



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, చిత్రంలో ఎస్పీ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల ప్రాణ భద్రత కోసం చేపడుతున్న రోడ్డు భద్రత చర్యల ఆంక్షలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ అదితి సింగ్, కమిటీ మెంబర్ కన్వీనర్, డీటీసీ మీరా ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతుండడం విచారకరమన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు కఠినం చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. రియల్టర్లు, రాజకీయ ప్రమేయాలకు స్పందించకుండా రోడ్డు భద్రతా ఆంక్షలను కఠినతరం చేయాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడయినా ప్రమాదాలు సంభవిస్తే సహించేదిలేదని... సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు ఫైల్ చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో కమర్షియల్, అధిక జన సంచార ప్రాంతాల్లో రోడ్డు భద్రతా చర్యల్లో ఆయా మున్సిపల్ కమిషనర్లు భాగస్వామ్యం కావాలన్నారు. రహదారులపై ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిని ఎవరు గమనించినా.. అలాంటి వారి వాహనం నెంబరు కనిపించేలా ఫొటో తీసుకుని.. సిటిజన్ పోలీసింగ్ వాట్సప్ నెంబర్ : 9542800800 కు కంప్లైంట్ చేయాలన్నారు. ఇలా రహదారుల భద్రత కోసం ప్రజల సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వస్తుంటారు.. పోతుంటారు

రాజంపేట సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టేందుకు యువ ఐఏఎస్‌లు వస్తున్నారు. కొన్ని నెలల పాటు ఉండి..తర్వాత పదోన్నతులు, ఇతర జిల్లా కేంద్రాలకు బదిలీపై వెళ్లి పోతున్నారు. మూడు దశాబ్దాల కిందట సబ్‌కలెక్టర్‌గా వచ్చిన వారు కనీసం ఏడాదిన్నరకుపైగా బదిలీ అయ్యేవారు కాదు. ఇప్పుడు వస్తున్న వారు కేవలం కొద్దినెలలో వెళ్లిపోతున్నారు. దీంతో రాజంపేట సబ్‌కలెక్టరేట్‌కు ఐఏఎస్‌లు అచ్చిరావడంలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



రాజంపేట సబ్‌కలెక్టరేట్

- రాజంపేట సబ్ కలెక్టరేట్‌లో మూన్నాళ్ల ముచ్చటగా మారిన ఐఏఎస్‌ల పాలన
- కేవలంలో నెలలలోపు బదిలీ

సబ్‌కలెక్టరేట్: రాజంపేట
కేంద్రం: పార్లమెంటు నియోజకవర్గం
ప్రారంభం: 1915
ఐఏఎస్‌లు: 24మంది

రాజంపేట: ఆర్డీవోలు అయితే తమకు అనుకూలంగా ఉండి, చెప్పిన పనిచేసి పెడతారన్న భావనలో కూటమినేతలు ఉన్నారు. ఆర్డీవో స్థాయి అధికారిని నియమించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. వారి ప్రయత్నాలు ఫలించలేదు. ఎన్నికల ముందు వచ్చిన ఆర్డీవో మోహనరావును కొనసాగించాలని కొంతమంది కూటమి నేతలు అడుగులు వేశారు.వీరి అడుగులకు బ్రేక్‌పడింది. తాజాగా రాజంపేట సబ్‌కలెక్టర్‌గా వైఖోమ్ నిదియాదేవి నియమితులయ్యారు. దీంతో అధికారపార్టీ నేతలకు నోట మాటరాలేదు.



కేతన్‌గార్గ్



ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

- 1915 నుంచి రాజంపేట సబ్‌కలెక్టరేట్ ఉండేది. జిల్లా కేంద్రంతో సమానంగా ఐఏఎస్‌ల పాలన రాజంపేట రెవెన్యూ డివిజన్‌లో కొనసాగింది. 1915లో 13 ఎకరాలకుపైగా విస్తీర్ణం కలిగిన స్థలంలో సబ్‌కలెక్టరేట్ ఏర్పాటైంది. రాజంపేట, రైల్వేకోడూరు ఉమ్మడి నియోజకవర్గానికి ప్రజాస్వామ్యపరంగా ప్రత్యేకభూమిక పోషించింది. వందేళ్లు పూర్తి చేసుకుంది. తెల్లదొరలపాలన నుంచి రెవెన్యూ సేవలందించిన రాజంపేట సబ్‌కలెక్టరేట్ చారిత్రాత్మక కట్టడంగా మిగిలిపోయింది. ఇప్పటికీ తెల్లదొరల రెవెన్యూ పాలనకు సంబంధించిన భవనాలు ఇక్కడ కనిపిస్తాయి. ఆనాటి బ్రిటీషు కలెక్టర్ ప్రేమగా పెంచుకుంటున్న గుర్రం చనిపోతే, జ్ఞాపకంగా సమాధి కట్టించారు. ఇప్పటికీ అన్నమయ్య సభాభవనం సమీపంలో సమాధి కనిపిస్తుంది. భవనాల ఆధునికీకరణలో భాగంగా తెల్లదొరల జ్ఞాపకాలు కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి.




వైకోమ్ నిదియా దేవి

బ్రిటీషు కాలం నుంచి ఐఏఎస్‌ల రాజ్యం..

బ్రిటీషు కాలం నుంచి డివిజన్‌కు ఎంతో చరిత్ర ఉంది. 1950 నుంచి రాజంపేట సబ్‌కలెక్టరేట్‌లో ఐఏఎస్‌లు పాలన కొనసాగించారు. తొలుత కె.శ్రీనివాసులతో ఐఏఎస్‌ల పాలన మొదలైంది. తర్వాత కే.రామచంద్రన్, టీఎల్ శంకర్, డీ.ఆరోరా, ఎంఎ స్‌రాజాజీ, సతీష్‌నాయర్, డీ. ఆరోరా, సీ.రామచంద్రమూర్తి టీఎస్ రంగాచారి, వల్లియప్పన్, ఎంఆర్ సాయ్, మిన్నిమాథ్యుస్, సతీ బాలకృష్ణ, షఫీక్విజ్ జామన్, రణదీప్‌సుడాన్, జానకికృష్ణమూర్తి, ఎకే గోయల్, సతీసుజామన్, రణబీర్‌సుధన్, అజయ్ జైన్, ప్రీతిమీనా(2012-2014) లాంటి వారు రాజంపేట సబ్‌కలెక్టర్‌గా పనిచేసి రెవెన్యూశాఖ పేరు ఇనుమడింపజేశారు. రాజంపేటలో ఐఏఎస్‌గా పనిచేసిన వారు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో వివిధ హోదాల్లో సేవలందించారు. తర్వాత కేతన్‌గార్గ్, ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ కొద్దినెలలే పనిచేశారు.పదోన్నతులపై జిల్లాకేంద్రానికి వెళ్లిపోయారు. ఇప్పుడు మణిపూర్‌కు చెందిన వైఖోమ్ నిదియాదేవి సబ్‌కలెక్టర్‌గా సేవలందించేందుకు వచ్చారు.రాజంపేటలో ఐఏఎస్‌ల పాలనను అధికారపార్టీ సాగనిస్తుందా లేదా అనేది వేచిచూడాలని సామాన్య ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

హార్టికల్చర్ కళాశాలలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ప్రారంభం



హార్టికల్చర్ కళాశాల ఓఎస్‌డీ డా.సుశీల

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని ఏపీ కార్ల్ ప్రాంగణంలో హార్టికల్చర్ కళాశాలలో నాలుగేళ్ల బీఎస్సీ కోర్సు ప్రవేశ దరఖాస్తులకు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనట్లు కళాశాల ఓఎస్‌డీ డా.సుశీల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ కార్ల్ ప్రాంగణంలో 2023 సంవత్సరంలో హార్టికల్చర్ కళాశాలను ప్రారంభించారు. మొదటి ఏడాదిలో అడ్మిషన్లు కూడా జరిగాయన్నారు. 2వ సంవత్సరం అడ్మిషన్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఆగస్టు 9వ తేదీ చివరి తేదీ అన్నారు. ఈ కోర్సు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఏపీ ఎంసెట్‌లో ర్యాంకు వచ్చిన వారే అర్హులన్నారు. సీటు వచ్చిన విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు హార్టికల్చర్ కళాశాలను సంప్రదించాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ



జేసీకి పూలమొక్క అందజేస్తున్న డీసీఓ

కడప అగ్రికల్చర్: డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. డీసీఎంఎస్‌ను అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. జేసీ అధితిసింగ్‌కు జిల్లా సహకార అధికారి సుబాషిణి, డీసీఎంఎస్ మేనేజర్ ఖాదర్ అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా ప్రభుత్వ, సాంఘిక సంక్షేమ, ఎయిడెడ్ మరియు మున్సిపల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆగష్టు 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులకు కనీసం 15 ఏళ్ల బోధనానుభవం కలిగి ఉండాలని, రాష్ట్ర స్థాయి అవార్డుకు దరఖాస్తు చేయువారు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలన్నారు. దరఖాస్తు దారుడిపై ఎలాంటి క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జ్, శాఖ పరమైన క్రమశిక్షణ చర్యలు ఉండరాదని తెలిపారు.

జులై 31న మహిళా పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా కేంద్రమైన కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, మిగిలిన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లు, సెకెండ్ షిఫ్ట్ ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ జులై 31న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందని కడప మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ సీహెచ్.జ్యోతి తెలిపారు. విద్యార్థులు తమ పరిధిలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కడప మహిళా పాలిటెక్నిక్‌లో డిప్లమో ఇన్ సివిల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ నెల 30వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు అనర్హులని తెలిపారు. కేటగిరీ వారీగా దాదాపు రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జులై 31వతేదీన ఉదయం పది గంటలకు కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు తమ పాలిసెట్-24 హాల్ టికెట్, పాలిసెట్ ర్యాంకు కార్డు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ధృవీకరణ పత్రాలు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు సెట్ల నకలు కాపీలు తీసుకురావాలని తెలిపారు. పాలిసెట్-2024 ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. అలాగే 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియలో పాల్గొనవచ్చన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ఇతను ఈ నెల 24వతేదీన అర్ధరాత్రి కడప ఆర్టీసి బస్టాండ్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు స్పందించి 108లో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా వుంటే తమను నేరుగా గానీ, ఫోన్‌లోగానీ సంప్రదించాలని చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి తెలియజేశారు. సీఐ: 9121100520కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మల్బరీ సాగుతో సిరులు పట్టు

జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తరిస్తోంది. రైతులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. చాలామంది రైతులు పట్టు పరిశ్రమ వైపు మొగ్గుచూపుతున్నారు. అధికారులు కూడా పట్టు పురుగుల పెంపకానికి సలహాలిస్తూ అండగా నిలుస్తున్నారు. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తూ పరిశ్రమను విస్తరించేందుకు చర్యలు చేపడుతోంది.

- లాభాలు కురిపిస్తున్న పట్టు పురుగుల పెంపకం
- ఈ ఏడాది ఖరీఫ్ లక్ష్యం 425 ఎకరాలు
- సిల్క్ సమగ్ర పథకంలో రైతులకు రాయితీ



పులివెందులలో సాగు చేసిన మల్బరీ తోట

కడప అగ్రికల్చర్ : జిల్లాలోని కడప, బద్వేల్, కమలాపురం, పులివెందులను నాలుగు సాంకేతిక కేంద్రాలుగా విభజించి సాగుకు కేటాయించారు. ఇందులో కడప, బద్వేల్, కమలాపురం సాంకేతిక కేంద్రం పరిధిలో 85 ఎకరాల చొప్పున, పులివెందుల సాంకేతిక కేంద్రం పరిధిలో మాత్రం 170 ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే పులివెందుల, ఖాజీపేట, మైదుకూరుతోపాటు పలు ప్రాంతాల్లో వంద ఎకరాల దాకా మల్బరీ సాగైంది.

ప్రభుత్వ నర్సరీల ద్వారా...

రైతులకు మొక్కలు అందించేందుకు ప్రభుత్వం కడప నగర శివారులోని ఊటకూరు, మైదుకూరు మండలం వనిపెంట పట్టు పరిశ్రమ శాఖ క్షేత్రంలోనూ మల్బరీ నర్సరీ సాగు చేపట్టింది. ఈ నర్సరీల్లో మొక్కలు తీసుకువెళ్లే రైతులకు ఒక్కో మొక్కకు రెండు రూపాయలు అందిస్తారు. 2024-25 సంవత్సరానికి 425 ఎకరాల్లో మల్బరీ సాగు లక్ష్యంగా ప్రభుత్వం కేటాయించింది.

యూనిట్ ఏర్పాటుకు రాయితీ ఇలా..

యాక్టివిటీ	యూనిట్ కాస్ట్ (రూపాయలలో)	సబ్సిడీ జనరల్ రూ.లలో)	సబ్సిడీ ఎస్సీ, ఎస్టీ (రూ.లలో)
మల్బరీ ప్లాంటేషన్	30,000	22,500	27,000
షెడ్ నిర్మాణం	4,00,000	3,00,000	3,60,000
పరికరాలు	75,000	56,250	67,500
క్రిమి సంహారానికి	5,000	3,750	4,500
మొత్తం	5,10,000	3,82,500	4,59,000

ఎవరెవరు అర్హులంటే..

జిల్లాలో మల్బరీ సాగుకు సంబంధించి 2.5 ఎకరాల నుంచి 5 ఎకరాల వరకు మల్బరీని సాగు చేస్తే ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఒక రైతుకు షెడ్డు, ప్లాంటేషన్, పరికరాలు, మందులకు కలిపి ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. దీనికోసం ప్రభుత్వం రైతుకు రూ. 5,10,000 ఇస్తుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీ అంటే రూ.4,59,000 పోగా మిగిలిన మొత్తం రైతు భరిస్తారు. జనరల్ రైతులకు 75 శాతం రాయితీ ఇస్తుంది. రూ.5,10,000 గానూ రూ.3,82,500 రాయితీ వస్తుంది. ఇదిగాక ప్రతి రైతుకు ఓసీలకు రూ.22,500, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.27వేలు సాగు ఖర్చుకు ప్రభుత్వం అందజేస్తోంది.

జిల్లాలో వంద ఎకరాల సాగు..



జిల్లాలో ఈ ఏడాది 425 ఎకరాల మల్బరీ సాగు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పటివరకు వంద ఎకరాల్లో సాగైంది. మల్బరీ సాగుకు జిల్లాలో ఊటకూరు, వనిపెంట కేవీకేలో నర్సరీలు ఉన్నాయి. మల్బరీ మొక్క కావాల్సిన రైతులు ఆ రెండు ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవచ్చు. మొక్కకు రూ.2 చొప్పున డబ్బులు తీసుకుని మొక్క అందిస్తాం. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ఈ ఏడాది సాగు ఆశాజనకంగా ఉండనుంది.

– అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి

ర్యాగింగ్.. చట్టరీత్యా నేరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరి ఎస్. బాబాఫక్రుద్దీన్



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్ : ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరం అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరి, జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. కడప నగర శివారులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, డ్రగ్ మెనాస్ నిర్మూలన బాధితులకు న్యాయసేవల పథకం 2015 గురించి ఆయన వివరించారు. సీనియర్ విద్యార్థులు కొత్తగా కళాశాలలో ప్రవేశించిన జూనియర్ విద్యార్థులను అవమానించడం, వేధించడం చేయరాదన్నారు. హెల్మెట్‌ను ప్రతి ఒక్కరూ ధరించి సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప డ్రగ్ ఇన్స్‌పెక్టర్ జి.మాధవి, అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఎస్.రవిబాబు, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుధాకర్ రెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు జయ శ్రీనివాసరావు, మాధవీలత, ఈశ్వరయ్య, సుబ్బయ్య, అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎన్జీఓలు పాల్గొన్నారు.

డీటీ సుహాసిని అక్రమాలపై విచారణ జరపాలి

దళిత ఫోరం జిల్లా ఛైర్మెన్ కిషోర్ బూసిపాటి

కడప కార్పొరేషన్ : వల్లూరు మండల డిప్యూటీ తహసీల్దారు సుహాసిని అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని దళిత ఫోరం జిల్లా ఛైర్మెన్ కిషోర్ బూసిపాటి డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 1982లో వల్లూరు మండలం అంబవరం గ్రామ సర్వే నంబర్ 1140-1లో ఒక్కొక్కరికి 1.25 ఎకరాల చొప్పున ప్రభుత్వం డీకేటీ భూములు కేటాయించిందని తెలిపారు. ఇందులో డి.ఏసన్న, ప్రకాశం తమకు ఇచ్చిన భూమిని సాగు చేసుకుంటూ వల్లూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకున్నారన్నారు. బ్యాంకర్లు పొలం ఆన్‌లైన్ ఆయి ఉంటేనే లోన్ ఇస్తారని, డీటీ సుహాసిని ఆన్‌లైన్ నిలిపివేసిందని, డిజిటల్ సైన్ లేదనే కారణం చూపి ఇతరుల పేర్లతో ఆ భూమిని ఆన్‌లైన్ చేసిందన్నారు. వారు రిజిస్ట్రేషన్ చేసుకోగానే వారి పేర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించి, ఎవరి పేరు లేకుండా పెండింగ్‌లో పెట్టిందన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఆమె పనిచేసిన కాలంలో మండలంలోని అన్ని భూ రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. అదే గ్రామంలో 20 ఎకరాల భూమిని అగ్రవర్ణాలకు బదలాయించారని ఆరోపించారు. ఆయకట్టు, వేస్ట్‌ల్యాండ్ రిజిస్టర్ కావని, దళితులకు చెందిన డీకేటీ భూములను అగ్రవర్ణాల పేర్లతో దొంగ రిజిస్టర్లు చేసుకున్నారన్నారు. ఆ నెపంతో పొలంలోకి ప్రవేశించి ట్రాక్టర్‌తో దున్నుతున్నారని, దీన్ని అడ్డుకున్న దళితులపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఇది సివిల్ మ్యాటర్ అని, పోలీసులు కూడా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూమి ఎవరిదని తేలేంత వరకూ ఎవరూ భూమిలో ప్రవేశించకుండా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో దళిత ఫోరం పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ అక్రమాలపై కలెక్టర్, సెంట్రల్ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితుడు సీమోను పాల్గొన్నారు.

డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న లత

ప్రొద్దుటూరు కల్చరల్ : తన డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని ఖాదర్ బాద్‌కు చెందిన ఎ.లత కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీలో పనిచేస్తున్న వాలంటీర్ గోపీకిశోర్ తనతో సన్నిహితంగా ఉండేవాడని, తన అవసరాల కోసం రూ.4.80 లక్షలు తీసుకున్నాడని తెలిపారు. కొంత కాలం తర్వాత తనను పెళ్లి చేసుకోవాలని అడిగినందుకు తనపై దాడి చేశాడన్నారు. ఆ దాడిలో తలకు, దవడ, కన్నుకు తీవ్ర గాయాలయ్యాయని, హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందానని తెలిపారు. ఇంకా మూడు ఆపరేషన్లు చేయించుకోవాలని వైద్యులు సూచించారన్నారు. తన డబ్బులు ఇవ్వాలని గోపీకిశోర్‌ను అడిగినా స్పందించకపోవడంతో రూరల్ ఎస్ఐకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆయన చర్యలు తీసుకోలేదన్నారు. పోలీసులు గోపీకిశోర్‌ను అరెస్టు చేసి తన డబ్బు తనకు ఇప్పించాలని, కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహ, ప్రతాప్‌రెడ్డి, చెన్నమ్మ, రవికుమార్ పాల్గొన్నారు.

విశాఖ జట్టు విజయ కేతనం

పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జట్లు విజయం



రాజారెడ్డి స్టేడియంలో తలపడుతున్న పశ్చిమగోదావరి, కడప జట్లు



హ్రితిక్ వర్మ (113 పరుగులు)



లోహిత్ (128 పరుగులు)



రచిత్ (5 వికెట్లు)



జున్నారావు (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో మూడు జట్లు విజయం సాధించాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడో రోజున శుక్రవారం 65 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 77.5 ఓవర్లలో 330 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని లోహిత్ లక్ష్మినారాయణ 140 బంతుల్లో 128 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వరుణ్ 56 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్ రచిత్ 5 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు 26 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 226 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని హ్రితిక్ వర్మ 70 బంతుల్లో 113 పరుగులతో రాణించాడు. దీంతో విశాఖ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేయగా, విశాఖ జట్టు 391 పరుగులు చేసి డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

పశ్చిమ గోదావరి జట్టు భళా...

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడో రోజున 306 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమ గోదావరి జట్టు 317 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ప్రణీత్ పవన్ 92 పరుగులు చేశాడు. కడప బౌలర్ ప్రణవ్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 61.2 ఓవర్లలో 177 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమగోదావరి జట్టు 20.3 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 76 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని సాయిర్ 17 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ధీరజ్‌కుమార్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 215 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పశ్చిమగోదావరి జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

శ్రీకాకుళం జట్టు గెలుపు

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 220 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు మూడో రోజున 58.5 ఓవర్లలో 269 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని అర్జున్ 75, కారుణ్యప్రసాద్ 43 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు జున్నారావు 5, సిద్ధువిఘ్నేష్ 2 వికెట్లు తీశారు. దీంతో శ్రీకాకుళం జట్టు ఇన్నింగ్స్ 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా శ్రీకాకుళం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 407 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 119 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీకాకుళం జట్టు ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఘన విజయం సాధించింది.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

రాయచోటి అర్బన్ : ఆధ్యాత్మికత అలవర్చుకోవడం ద్వారానే మానసిక ప్రశాంతత చేకూరుతుందని కడప చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురియానంద సరస్వతి అన్నారు. స్థానిక సాయి ఇంజినీరింగ్ కళాశాలలో కడప చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియన్స్ టు ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా అంశంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తురియానంద సరస్వతి మాట్లాడుతూ మానవ జన్మను ఆధ్యాత్మిక చింతనతోనే సార్ధకత చేసుకోవాలన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవు

బద్వేలు అర్బన్/అట్లూరు : గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని, ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బద్వేల్, అట్లూరు ఎంపీడీవో కార్యాలయాల్లో బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని కోరారు. గ్రామాల్లో పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ఉపరితల జలాశయాలు, భూతల జలాశయాలను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని కోరారు. గ్రామాల్లో పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో డీఎల్‌పీఓ రమణారెడ్డి, బద్వేలు, గోపవరం మండలాల ఈఓపీఆర్‌డీలు ఆదినారాయణ, హసీనా, అట్లూరు సర్పంచ్ అట్లూరు యల్లమ్మ, ఏఓ భాస్కర్‌బాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తప్పిపోయిన విద్యార్థులు క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు



తప్పిపోయిన విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ

బద్వేలు అర్బన్ : జిల్లాలోని చెన్నూరులో ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లి తప్పిపోయిన ముగ్గురు విద్యార్థులను బద్వేలు అర్బన్ పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నూరు గ్రామానికి చెందిన విద్యార్థులు హేమంత్, గురు తరుణ్, గుణవర్ధన్ స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. రోజు మాదిరే పాఠశాలకు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వారు పాఠశాలకు డుమ్మా కొట్టారు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన వారి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వెళ్లి విచారించగా పాఠశాలకు రాలేదని చెప్పారు. దీంతో చెన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి పిల్లల ఫొటోలను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపారు. అప్రమత్తమైన బద్వేల్ అర్బన్ సీఐ పి.యుగంధర్.. ఎస్ఐ ఎం.సత్యనారాయణ, సిబ్బంది కలిసి గాలింపులు చేపట్టగా ఆర్టీసీ బస్టాండు సమీపంలో ముగ్గురు విద్యార్థులు కనిపించారు. వెంటనే వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. గంటల వ్యవధిలోనే తమ పిల్లలను గుర్తించి తమకు అప్పగించిన అర్బన్ పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, వీణ, హోంగార్డు వి.ఎ.పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

డాడీ హోంలో ఆకలి కేకలు

- రాజా ఫౌండేషన్ ట్రస్టు... చిన్నజీయర్ స్వామి ట్రస్టుగా మార్పు
- ట్రస్టు మాజీ ఛైర్మన్, కేర్ టేకర్లపై తప్పుడు కేసులు
- ఆవేదన వ్యక్తం చేసిన మాజీ ఛైర్మన్, కేర్ టేకర్లు
- బీజేపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు



మాట్లాడుతున్న రాజా ఫౌండేషన్ మాజీ ఛైర్మన్ రాధా

ప్రొద్దుటూరు క్రైం : 'వైఎస్సార్ జిల్లాలో ఎంతో మంచి ఆశయంతో రాజారెడ్డి అలియాస్ డాడీ రాజాఫౌండేషన్‌ను స్థాపించారు.. ఎంతో మంది అనాథలు, అభాగ్యులను చేరదీసి పోషిస్తూ వచ్చారు.. అయితే రాజారెడ్డి మరణం తర్వాత అక్కడి అనాథల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వారికి తిండికి కూడా ట్రస్టు నిర్వాహకులు డబ్బు ఇవ్వడం లేదు' అంటూ ట్రస్టు మాజీ ఛైర్మన్ రాధా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం రాధతో పాటు కేర్ టేకర్లు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. రాజుపాళెం మండలం పర్లపాడు గ్రామానికి చెందిన నల్లదిమ్మ రాజారెడ్డి 2002లో మైలవరంలో డాడీ హోం ఏర్పాటుచేసి అనాథలు, అభాగ్యులు, హెచ్ఐవీ బాధితులకు సేవ చేస్తూ వచ్చారు. డాడీ హోం నిర్వహణకుగానూ ప్రొద్దుటూరు మండలంలోని చౌడూరు సమీపంలో పూజా స్కూల్ ఏర్పాటుచేశారు. రాజాఫౌండేషన్ ట్రస్టులో రాజారెడ్డి కుటుంబసభ్యులు కమిటీలో కొనసాగేవారు. రాజా ఫౌండేషన్‌ను అనాథ పిల్లల ద్వారానే నడపాలనే ఉద్దేశంతో వారి కుటుంబ సభ్యులను కమిటీ నుంచి తొలగించారు. చిన్నప్పటినుంచి డాడీ హోంలోనే పెరిగిన మేడు రాధాను ఛైర్మన్‌గా, భూపాని కవితను సీఈఓ, ట్రస్టీగా, భూపాని లక్ష్మీ ప్రసన్నలను ట్రస్టీగా నియమించారు. ఈ నిర్ణయం తీసుకున్న రెండు రోజులకే 2023 ఆగస్టు, 11న రాత్రి రాజారెడ్డి హత్యకు గురయ్యారు. ఆస్తికోసం హత్య చేసిన వ్యక్తులు తమకు హాని తలపెట్టొచ్చని నాటి ట్రస్టు నిర్వాహకులు భావించారు. ఈ క్రమంలోనే త్రిదండి చిన్నజీయర్ స్వామిని కలిసి 2023 నవంబర్, 22న రాజా ఫౌండేషన్ ట్రస్టును మార్పు చేశారు. చిన్నజీయర్ స్వామి ట్రస్టు అధ్యక్షుడిగా బుశెట్టి రామ్మోహన్‌రావు, కార్యదర్శిగా గొర్రె శ్రీనివాసులు, చిన్నజీయర్ స్వామి మేనల్లుడు విష్ణు చింతన్‌లను కోశాధికారిగా నియమించారు.

ఆస్తుల కబ్జాకు యత్నం

కడప ఎడ్యుకేషన్ : పొద్దుటూరు పట్టణంలోని డాడీ హోమ్ అధినేత దివంగత ఫాదర్ రాజారెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న పూజా ఇంటర్నేషనల్ ఆస్తులను కబ్జా చేసేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఏఐయస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ ఆరోపించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ వారిపై విచారించి విద్యార్థులకు భద్రత కల్పించాలన్నారు. పూజ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మమ్మల్ని బెదిరిస్తున్నారు...

కడప కోటిరెడ్డిసర్కిల్: డాడీ హోంతోపాటు పూజా ఇంటర్నేషనల్ స్కూల్ పిల్లలకు తమ వంతు తోడ్పాటు అందిస్తున్న తమకు ప్రాణ రక్షణ కల్పించాలని హోం నిర్వాహకులు కవిత, రాధ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ మా సంస్థ వేరే వారి పేరిట మారుస్తున్నట్లు సమాచారం ఇచ్చారన్నారు. మరుసటి రోజు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు దగ్గరకి వెళ్లేసరికి బుశెట్టి రామమోహన్ రావు, గొర్రె శ్రీనివాసులు, కిరణ్మయి, విష్ణు చింతన్, రవీంద్ర బాబుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడంతో తాము సంతకం పెట్టడం జరిగిందన్నారు. ఇపుడు ప్రశ్నిస్తే తమపై కేసులు పడతామని బెదిరిస్తున్నారన్నారు.

ట్రస్టు మార్పు తర్వాత పట్టించుకోలేదు

అనాథ పిల్లలకు ఇబ్బంది జరగకుండా ట్రస్టు నిర్ణయాలు తీసుకోవాలని మాజీ ఛైర్మన్ రాధా, కేర్ టేకర్లు చిన్నజీయర్‌స్వామికి, పెద్దలకు రాధా తెలిపారు. 'ట్రస్టు మార్పునకు సంబంధించిన డాక్యుమెంట్లు వారి చేతిలోకి వచ్చే వరకు ఎంతో వినయం ప్రదర్శించిన పెద్దలు తర్వాత ఫోన్ లిఫ్ట్ చేయడంలేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా బీజేపీ నాయకుల ఒత్తిడితో కేసు నమోదు చేయలేదు.' అని రాధా, కేర్ టేకర్లు ఆరోపించారు. ప్రస్తుత ట్రస్టు పెద్దలైన బుశెట్టిరాము, గొర్రె శ్రీనివాసులు, విష్ణుచింతనస్వామి కలిసి అర్ధరాత్రి 12 దాటిన తర్వాత ఎప్పుడు పడితే అప్పుడు పోలీసులను పంపించి వారిని ఇబ్బందిపెడుతూ వచ్చారని తెలిపారు. 'మహిళలని చూడకుండా తప్పుడు కేసులు పెట్టించారు.. ట్రస్టు బాధ్యతలు తీసుకున్న పెద్దలు ఏనాడు పిల్లలతో మాట్లాడలేదు. వివిధ రాష్ట్రాలు, దేశాల్లో చదివిస్తున్న వారి హాస్టల్, కాలేజీ ఫీజు చెల్లించకపోవడంతో కొందరు పిల్లలు కొందరు తిరిగొచ్చారు.' అని ఆరోపించారు.

చిన్నజీయర్ స్వామిని కలవనీయలేదు



రాజా ఫౌండేషన్‌లో జరుగుతున్న అన్యాయాలపై చిన్నజీయర్ స్వామికి చెప్పడానికి ఎంత ప్రయత్నించినా వారిని కలవనీయలేదు. విష్ణుచింతన్ అనే వ్యక్తి స్వామీజీని కలవనీయకుండా అడ్డుకుంటూ వస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్తే మహిళలని చూడకుండా బయట ఐదు గంటలు నిల్చోబెట్టారు. చేసేదేమీలేక తిరిగి వచ్చారు. ట్రస్టు పెద్దలు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తే పోలీసులు దానిపై క్షుణ్ణంగా విచారణ చేయలేదు. ట్రస్టు పెద్దలను నిలదీస్తున్న కవిత, రాధాలను బయటికి పంపించాలని కుట్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాజా ఫౌండేషన్ ట్రస్టును చిన్నజీయర్ స్వామి నుంచి వెనక్కి తీసుకోవాలని మాజీ సభ్యులు, కేర్ టేకర్లు, అక్కడి అనాథ పిల్లలు తీర్మానం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఆర్డీఓను కలవనున్నట్లు వారు తెలిపారు. ట్రస్టు పెద్దలను ఎదిరించలేకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.